మాతృభాష చరిత్రకు సజీవ సాక్ష్యం

ఓయూ రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి



మాట్లాడుతున్న ఓయూ హిందీ విభాగం ప్రొఫెసర్ సంగీత

కాచిగూడ: మాతృభాష అంటే కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే భావవ్యక్తీకరణ మాత్రమే కాదని అది మనవజాతి జీవనాడి అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ మాజీ అధిపతి ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మాతృభాష అంటే వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతికి సజీవ సాక్ష్యమని అన్నారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భాషను దూరం చేసుకుంటే మన ఉనికికే ప్రమాదమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 7వేల భాషలున్నాయని, వీటిలో ప్రపంచంలో సగానికి పైగా 23 భాషలు మాట్లాడుతున్నారని తెలిపారు. మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష అమ్మభాష అని పేర్కొన్నారు. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించడం సులభమని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ కె.సంగీత మాట్లాడుతూ.. మాతృభాషను విస్మరించడమంటే కన్నతల్లిని మర్చిపోవడం లాంటిదేనని చెప్పారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట్‌రావు, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, కార్యదర్శి సాయిరామ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డలో రూ.27లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించి క్షేత్రస్థాయిలో వాటిని పరిష్కరించాలన్నారు. జలమండలి డ్రైనేజీ సమస్యలపై మరింత శ్రద్ధతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వివరించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ సబిత, బీఆర్‌ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్, కళావతి, లావణ్య, తార, ఆర్.సంతోష్, మహేష్ తదితరులున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై అధికారుల సమీక్ష


సమీక్షలో డీఎంసీ మారుతీ దివాకర్

అంబర్‌పేట్: సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి అధికారులకు సహకరించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతీ దివాకర్ తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.53 కోట్ల లక్ష్యం ఉందని, దానిని చేరుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఆస్తి పన్ను కోసం చెక్కుల ద్వారా చెల్లించిన చెక్కులు బౌన్స్ అయ్యాయని, వాటిని తిరిగి రాబట్టేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

నియామకం


హనుమంతు ముదిరాజ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ సంజీవరెడ్డి

కాచిగూడ: టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సెక్రటరీ జనరల్‌గా కె.హనుమంత్‌ముదిరాజ్‌ను నియమిస్తూ.. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురువారం సంజీవరెడ్డి నివాసంలో హనుమంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, ఆర్టీసీ కార్మికులకు మధ్య వారధిలా స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ పనిచేస్తుందన్నారు. ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు టి.సుధాకర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ టి.సుధాకర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అదనపు జనరల్ సెక్రటరీ అబ్రహం గోపాల్, శీనయ్య పున్న, గోలి రవీందర్, స్వాములయ్య, వెంకటేష్, బుల్లెట్ పాండు, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష స్థానం గొప్పది

ఆచార్య కొలకలూరి ఇనాక్


మాతృభాష దినోత్సవంలో మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతృభాష ఎప్పుడూ మృత భాష కాదని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. లయన్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలుగు భాష సాహిత్యానికి చేసిన కృషి అనితరసాధ్యమన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఎన్‌జీవోస్ నెట్‌వర్క్ కార్యాలయంలో భారత సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ... దేశ భాషలందు తెలుగు లెస్సా అని అన్నారన్నారు. ఎంతో మంది కవుల నోటి నుంచి జాలువారే పాటలు, మాటలు కూడా మాతృభాష సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. చరిత్రలో మాతృభాషకు ఉన్న స్థానం ఎంతో గొప్పదన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్న ఎంత గొప్ప స్థాయికి ఎదగిన మీ సక్సెస్‌కు కారణంగా అమ్మ భాషే అన్నారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవి శ్రీనివాస్‌గౌడ్, ప్రముఖ కవులు జల్ది విద్యాధర్, వి.డి.రాజగోపాల్, గుత్త హరి తదితరులు పాల్గొన్నారు.

షబ్బె బారాత్‌కు ఏర్పాట్లు

కాచిగూడ: ఫిబ్రవరి 25న జరగనున్న షబ్బె బారాత్ కార్యక్రమాలకు అంబర్‌పేట నియోజకవర్గంలోని ముస్లిం శ్మశాన వాటికల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అంబర్‌పేట అసెంబ్లీ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ఫరీద్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. రోహిన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురువారం పార్టీ నేతలతో కలిసి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ముజాహిద్, జహంగీర్, ఫయీమ్, సయ్యద్‌గౌస్, మహమ్మద్ ఖాజా, నిజామ్, హమీద్, ఇసాముద్దీన్, మజర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చొరవతోనే రామమందిర కల సాకారం


అయోధ్యకు వెళ్తున్న భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో అయోధ్యలో రామమందిరం నిర్మాణం ఒక అద్భుతమైన ఘట్టంగా నిలిచిందని బీజేపీ నేత డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని సందర్శించేందుకు గురువారం ఆస్తా ట్రైన్‌లో వెళ్తున్న భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి హిందువులు అయోధ్యలో రామమందిరం కోసం ఎదురు చూశారని, ఈ ఆశయం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంతో సాకారమైందన్నారు. బీజేపీ నేతలు ఎ.అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, యశ్వంత్, అజయ్‌గౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీజేపీ నేత మృతి


ఆది నాగేష్ (ఫైల్)

కాచిగూడ: కాచిగూడకు చెందిన బీజేపీ సీనియర్ నేత ఆది నాగేష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్ ద్వారా పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన పార్థివ దేహానికి బీజేపీ గ్రేటర్ ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, కృష్ణకుమార్, నర్సింగ్‌రావు, శేర్‌సాగర్, హజారిబాబు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా


సమీక్ష సమావేశంలో డీఈ హేమచందర్, విద్యుత్ సిబ్బంది

కాచిగూడ: వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగినా.. ప్రజలకు అవసరమైన విద్యుత్ మన వద్ద ఉందని, ప్రజలకు మరింత మెరుగైన నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా సిబ్బంది ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ డీఈ హేమచందర్ సూచించారు. గురువారం ఇందిరాపార్క్ విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఏడీఈ మక్సూద్ అహ్మద్తో కలిసి ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని రకాల వనరులను సమకూర్చినట్లు వివరించారు. ప్రస్తుతం వినియోగదారుల అవసరానికి తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగినా.. విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా విద్యుత్‌ను వాడుకోవాలని సూచించారు. విద్యుత్ ఏఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఏబీవీపీ అరాచకాలను అరికట్టడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజు కోరారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులపైన ఏబీవీపీ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్‌ను బూతులు తిడుతూ 12 మంది ఏబీవీపీ నాయకులు చొక్కా చించి దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటాలను ఔర్వలేకనే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కిరణ్, రజనీకాంత్, మమత, రమ్య, స్టాలిన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్: డివిజన్‌లో ఉన్న నాలా పూడికతీత పనులపై అధికారులు దృష్టి సారించాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం బతుకమ్మకుంటలో నాలా సమస్యలపై అధికారులతో కలిసి పరిశీలించారు. నాలాలో పేరుకపోయిన పూడికను తొలిగించే ప్రక్రియను చేపట్టాలని ఆమె చెప్పారు. నాలా సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న భారత్ బచావో సదస్సు

లక్డీకాపూల్ : జాతీయ విద్యా విధానం(ఎన్ఇపీ-2020)ను రద్దు చేయాలని భారత్ బచావో నిర్వాహకులు డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేష్‌బాబులు డిమాండ్ చేశారు. ఉమ్మడి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ నెల 25, 26వ తేదీల్లో నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత విద్యార్థుల సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖిల భారత విశ్వవిద్యాలయాల విద్యార్థులు నిర్వహణలో జరిగే ఈ సదస్సులో సోషల్ డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు ఆకునూని మురళి, భారత్ బచావో చైర్మన్ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతిలతో పాటు వివిధ యూనివర్శిటీల ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవసరం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడు మంచి భవిష్యత్ సాకారం అవుతుందని న్యూట్రీవిండ్ హెల్త్ కేర్ వ్యవస్థాపకులు విశాల్ మాడిూరి అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో క్లీనికల్ న్యూట్రీషన్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ... న్యూట్రీషన్ చదువుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కళాశాల న్యూట్రీషన్ విభాగం అధ్యక్షుడు బి.అనూష, సి.ఆర్.కీర్తన, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివాజీ జయంతికి సెలవు ప్రకటించాలని వినతి



కాచిగూడ: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజున జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సిడి చవాన్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ జయంతి, శోభాయాత్రను విజయవంతం చేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి శివాజీ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించేలా ప్రధాని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు హామీ ఇచ్చారన్నారు.

వినతిపత్రం అందజేత


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అంబర్‌పేట్: రాష్ట్రంలో గ్రంథాలయశాఖలోని ఖాళీలను భర్తీ చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రాష్ట్ర గ్రంథాలయ సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. గురువారం మంత్రిని కలిసి గ్రంథాలయ సమస్యలను వివరించారు. గ్రంథాలయాలను బలోపేతం చేసి అవసరమైన ప్రాంతాల్లో కొత్త గ్రంథాలయాల ఏర్పాటుకు తోడ్పాటును అందించాలని కోరారు. రాష్ట్ర గ్రంథాలయాల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి చేగోడి రవికుమార్, సభ్యులు కుమార్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

1న ముషీరాబాద్ నియోజకవర్గంలో విజయ సంకల్పయాత్ర



ముషీరాబాద్: మరోసారి నరేంద్రమోదీని ప్రధాన మంత్రిని చేసేందుకు మార్చి 1వ తేదీన ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను నిర్వహించనున్నట్లు మహంకాళీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు తెలిపారు. ముషీరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పూస రాజు ఆధ్వర్యంలో రూపొందించిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం అధ్యక్షతన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ... సంకల్పయాత్ర ప్రారంభానికి ఒక రోజు ముందు ఈ నెల 29వ తేదీన రాత్రి ముషీరాబాద్ ఖషిష్ ఫంక్షన్‌హాల్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ, రాష్ట్ర నాయకులు బస చేస్తారని తెలిపారు. 1వ తేదీన ఉదయం 8 గంటలకు ముషీరాబాద్ చౌరస్తా వద్ద విజయ సంకల్ప యాత్ర ప్రారంభమై నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో నిర్వహించి రాంనగర్ చౌరస్తాలో పది వేల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. బీజేపీ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు, నియోజకవర్గ నేతలు ప్రభారి వేముల ఆశోక్, అధికార ప్రతినిధి రాంరెడ్డి, నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు జమాల్‌పురినందు, బిజ్జి కనకేష్‌కుమార్, సదానంద్, జి.వెంకటేష్, ఆర్.విశ్వం, నగర నాయకులు శేషసాయి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

కాచిగూడ: గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ్ రాజు, ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుద్బిగూడలో నివాసం ఉండే శ్రీనివాసులు (60) ఇంట్లో ఎవరికీ తెలియకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. కాగా పోలీసులకు సమాచారం అందడంతో వారు సదరు ఇంటిపై దాడి చేసి నిర్వాహకుడు శ్రీనివాసులును అరెస్ట్ చేశారు. ఓ మహిళతో పాటు విటులు పిర్జాదిగూడకు చెందిన నవీన్‌రెడ్డి (40), సాగర్ రెడ్డి (40) తలాబ్ కట్టకు చెందిన ఎండీ అక్బర్ (36)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 9 వేల నగదు, ఒక సెల్‌ఫోన్, కండోమ్ పాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు



చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హుండీని లెక్కించారు. దేవాదాశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పరిశీలనతో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ దేవనాథం మాట్లాడుతూ... నెల రోజులకు గాను రూ. 1.46,743 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు బుగ్గా లక్ష్మీపతి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ రంగస్థల కళాకారుడు కాశీభట్ల కృష్ణశాస్త్రి మృతి


కాశీభట్ల కృష్ణశాస్త్రి (ఫైల్)

చిక్కడపల్లి: ప్రముఖ రంగస్థల కళాకారుడు కాశీభట్ల కృష్ణ శాస్త్రి(77) గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయనకు భార్య విశాలాక్ష్మి, కుమారుడు కె.విక్రమ్, కుమార్తె వరలక్ష్మి, లలిత లక్ష్మీరాజ్యం ఉన్నారు. ప్రస్తుతం ఆయన జవహర్ నగర్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. త్యాగరాయ గానసభ పాలకమండలి సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఆయన నటుడే కాక ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న సమయంలో యూనియన్ నాయకుడిగా ఉద్యోగులకు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. కొన్ని నెలల కింద ఆయన చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభకు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రమాదానికి గురైన నాటి నుంచి ఇంటికి పరిమితమైన కృష్ణశాస్త్రి తలలో కూడా రక్తం గడ్డకట్టడంతో శాస్త్ర చికిత్స చేశారు. రెండు రోజుల నుంచి ఆరోగ్యం మరింత క్షీణించడం, శ్వాస ఆగిపోవడం, అదే సమయంలో గుండెపోటు రావడంతో వెంటనే కుటుంబసభ్యులు ముషీరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్సపొందుతూ కృష్ణశాస్త్రి తుదిశ్వాస విడిచారు. కృష్ణశాస్త్రి అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కె.వి.రమణాచారి, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, కిన్నెర సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎం.కె.రాము, అభినందన సంస్థ అధినేత్రి డాక్టర్ ఇ.భవానీ, వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వైఎస్ఆర్ మూర్తి తదితరులు సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా కృష్ణశాస్త్రి మృతిపట్ల త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకుల బాలస్వామి సంతాపం తెలిపారు.

రాజద్రోహం కేసులను ఎత్తి వేయాలి


మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ముషీరాబాద్: నాలుగు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, ఆందోళనల్లో నిత్యం తిరగాడే న్యూడెమొక్రసీ నాయకులపై కాంగ్రెస్ పాలనలో రాజద్రోహం కేసులు నమోదు చేయడం సరైంది కాదని న్యూడెమొక్రసీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ముఖ్య నేతలుగా ఉన్న కె.గోవర్ధన్, సాదినేని వెంకటేశ్వరరావు, గౌని ఐలయ్య లాంటి నాయకులపై 120–బి రాజద్రోహం కేసులను ఎలా మోపుతారని ప్రశ్నించారు. ఇది అన్యాయమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. న్యూడెమొక్రసీ ప్రతినిధి బృందం ఆయనకు వినతిపత్రం సమర్పించి కేసులను ఎత్తివేయాలని కోరారు. న్యూడెమొక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కె.గోవర్ధన్, గౌని ఐలయ్య, జి.అనురాధ ఉన్నారు.

భువనగిరి ఎంపీ అభ్యర్థిగా జాజులకు అవకాశం కల్పించాలి

కవాడిగూడ: రెండున్నర దశాబ్దాలకుపైగా రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ హక్కుల, సమస్యల సాధన కోసం అహర్నిశలు పోరాటం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి అవకాశం కల్పించాలని రాష్ట్ర వ్యాపంగా 136 కుల సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి వెల్లడించారు. గురువారం దోమలగూడ బీసీ భవన్‌లో వివిధ బీసీ కుల సంఘాల నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ సంఘాల కుల సంఘాల నేతలతో మాట్లాడుతూ... బీసీ ఉద్యమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విస్తృతంగా నిర్మాణం చేసి బీసీ సమస్యలపై గత 25 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు ఉందన్నారు. సమావేశంలో గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకులు మాదేశీ రాజేందర్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనందలక్ష్మి, నగర సంఘం నాయకులు సాయినాథ్‌సాగర్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఓంకార్, సి.హెచ్.ప్రవీణ్, వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

మసీదుల వద్ద వసతులు కల్పించండి

ముషీరాబాద్: జగ్నేకి రాత్ నేపథ్యంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మసీదులు, శ్మశానవాటికల వద్ద వెంటనే తగు వసతులు కల్పించాలని ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ ఖదీర్ మొహియుద్దీన్‌కు గురువారం బీఆర్‌ఎస్ నేతలు వినతి పత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలు అక్లాక్ హుస్సేన్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటి అధ్యక్షులు పర్వేష్, అడిక్‌మెట్ డివిజన్ సీనియర్ నాయకులు ఖదిర్ నియాజ్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సైతం విజ్ఞప్తి చేశామని తెలిపారు.



నేడు ఎన్టీఆర్ స్టేడియంలో అన్న ప్రసాద వితరణ

కవాడిగూడ: కామాఖ్య మృత శోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో రాజ శ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అన్నప్రసాద వితరణ జరుగనుంది. వాసవి సేవా సమితి రాంనగర్ నేతృత్వంలో ఆర్యవైశ్య సంఘం గాంధీ నగర్, ఆర్యవైశ్య సంఘం చిక్కడపల్లి, వాసవి సేవా కేంద్ర హైదరాబాద్, వాసవి క్లబ్ సంస్థల సౌజన్యంతో మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఆయా సంస్థల ప్రతినిధులు కాసనగట్టు రాజశేఖర్‌గుప్తా, వాడకట్టురాజుగుప్తా, అమరవాది నాగరాజు, అనంతుల ఆంజనేయులు, నీతి సత్యనారాయణ తెలిపారు. గురువారం రాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో వారు అన్న ప్రసాద వితరణ పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శత రాజ శ్యామల యాగం, 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శివ పార్వతుల కల్యాణం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం

ముషీరాబాద్: పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు రోజీ సాయంత్రం నిర్వహించే స్పెషల్ క్లాసుల్లో వారు అలసి పోకుండా ఉండేందుకు రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ... మార్చి 17వ తేదీ వరకు అల్పాహారం పంపిణీ చేస్తామన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాస్ పటాలే, కమల్‌కుమార్‌శర్మ, రమణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో పరీక్షలంటే భయం లేకుండా ఉండేందుకు మానసికంగా ధైర్యంగా పర్సనాలిటీ కేర్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అవగాహన తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

కాచిగూడ: కదులుతున్న రైలు ఎక్కబోతూ కింద జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... నంద్యాల జిల్లా ఎంఎస్‌నగర్ ప్రాంతానికి చెందిన పాస్టర్ పేరు మల్ల జాన్ క్రిస్తుదాస్ (61) సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నెంబర్ 3 వద్ద ఎంఎంటీఎస్ రైలు బయలుదేరుతుండగా.. రైలు ఎక్కబోయి జారికిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్. చారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.